

నిండుకున్న పంపా రిజర్వాయర్

ప్రజాశక్తి - అన్నవరం

గత మూడు రోజులుగా భారీ వర్షాలకు అన్నవరం పంపా రిజర్వాయర్‌లోని నీటిమట్టం బ్రహ్మ దగ్గర స్థాయి దగ్గర్లో గురువారం సాయంత్రానికి 103 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలోని పెద్ద బాపన్న చెరువు, చిన్న బాపన చెరువులోకి అధిక మొత్తంలో వరద నీరు చేరుకుంది. దీనితో అక్కడి నుంచి 1800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పంపా రిజర్వాయర్ నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరడంతో సుమారు 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డిఇ సురేష్ తెలిపారు.



పంపా రిజర్వాయర్

నష్టం మిగిల్చిన మిచౌంగ్

- దాటిన తుపాన్ గండం -కష్టాల సుడిలో కర్షకులు
- కానరాని సర్కారు ముందస్తు చర్యలు
- తేలుతున్న నష్టం -33,340 ఎకరాల్లో నష్టం
- కాకినాడలో లోతట్టు ప్రాంతాలు జలమయం

తుపాన్ గండం దాటడంతో జిల్లా ప్రజానీకం ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే అన్నదాతలు మాత్రం ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. వరుసగా మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వరి రైతు నిండా మునిగాడు. పెద్దఎత్తున వీచిన ఈదురు గాలులకు కళ్ళ ఎదుటే పంటంతా నేలను తాకడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు.



గండేపల్లిలో పొలంలో నీటిపై తేలుతున్న వరి పనలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

తుపాన్ గండం నుంచి బయటపడటంతో ఇప్పుడిప్పుడే పంట నష్టం తేలుతుంది. వాతావరణ శాఖ గత కొన్ని రోజులు ముందు నుంచే హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రభుత్వం ముందస్తుగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈసారి రైతులు పెద్ద స్థాయిలో నష్టపోయే అవకాశం ఉంది. ముందస్తుగా ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో భారీ నష్టం తప్పేలా లేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 21 మండలాల్లో 50 శాతం మంది రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేసుకోగా మిగిలిన రైతులు కోతలు కోయాల్సి ఉంది. తుఫాన్‌కు ముందే అనేక మంది రైతులు యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసి తేమ శాతాన్ని తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెట్టారు. ఈలోగా వదలని వానలు నిండా ముంచెత్తాయి. ధాన్యం రాశుల చుట్టూ పెద్ద ఎత్తున నీరు చేరి 50 శాతానికి పైగా ధాన్యం తడిసి ముద్దయింది. మూడు రోజులు పాటు కురిసిన వానలకు మొలకలు వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల కోయకుండా ఉన్న పంట నేలను తాకి నీటిలో నానుతుంది. అతి కొద్ది రోజుల్లోనే చేతుకొస్తుందనుకున్న వరి కళ్ళ ఎదుటే కుళ్ళిపోతుందని రైతులు వేదనకు గురౌతున్నారు. కూలీల ద్వారా కోసిన పొలాల్లో పనులపై ఉన్న పంట చాలా చోట్ల నీటిలో ఉండిపోయింది. పూర్తిగా నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

జిల్లాలో 2.6 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేయగా, ఇప్పటి వరకు 1.32 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తి చేసిన రైతులు పంట ఒబ్బిడి చేసుకున్నారు. ఇంకా సుమారు 27 వేల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. కాజులూరు, తాళ్ళరేవు, కోట నందూరు, ప్రత్తిపాడు, తొండంగి, యు.కొత్తపల్లి, పిఠాపురం, కరప, కాజులూరు, తాళ్లరేవు, సామర్లకోట తదితర మండలాల్లో పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు అంచనా. నాలుగు రోజుల వర్షాలకు కోయకుండా ఉన్న సుమారు 13 వేల ఎకరాల్లో పంట పూర్తిగా తడిసి ముద్దైంది. ఈదుర గాలులకు సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు నేలనట్టిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 1500 ఎకరాల్లో పనుల మీద ఉన్న పంట నీటిలో ఉంది. 7630 ఎకరాల్లో పంట కుప్పలపై ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరంలో 33 శాతానికి పైగా నష్టం వాటిల్లిన పంటకు నష్టపరిహారం చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు సుమారు 33,340 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అంచనాల్లో ఉన్నారు. **కాకినాడ** కాకినాడ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షంతో స్మార్ట్ సిటీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. లోతట్టు ప్రాంతాలు ఆందోళనకరంగా మారాయి. ప్రధాన రహదారులు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లు, డ్రయినేజీలు ఒక్కటిగా మారిపోయి పలు గృహాల్లోకి మురుగు నీరు చేరింది. దీంతో ప్రజలు రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. నగరంలో వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నీటిని బయటికి పంపి ఏర్పాట్లు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ చాలా దారుణంగా ఉందని మాజీ మేయర్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని ఆరోపించారు. భారీవర్షాలతో ముంపునకు గురైన 31, 34 డివిజన్లలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి శానిటేషన్ పరంగ ఎటువంటి సహాయక చర్యలు లేవని, అధికారులు వెంటనే ముంపు ప్రాంతాలను పర్యటించి తక్షణం శానిటేషన్ పరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు గోడారి గుంట, రాధానగర్, మేడలైన్ ప్రాంతాల్లో పర్యటించారు.రాధానగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను మాజీ కార్పొరేటర్ కంపర బాబి, స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. న్యాయపరమైన వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్న అక్కడి డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తే చాలా వరకు ముంపు సమస్య పరిష్కారమవుతుందని కమిషనర్‌కు వివరించారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి. సత్యకుమారి, ఇఇలు వెంకటరావు, మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్వైజర్ జిలాని, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, తదితరులు ఉన్నారు. **కోటనందూరు** గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని కాకరాపల్లి గ్రామ శివారు ఉప్పరగూడెం వద్ద ఎదురుల గడ్డ వాగు పొంగిపొర్లింది. బ్రిడ్జిపై నుంచి వాగు ఉప్పొంగడంతో కాకినాడ, అనకాపల్లి జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు, ఇతర వాహనాల్లో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తుని-నర్సీపట్నం రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బ్రిడ్జి వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ వాగులు పొంగడంతో సుమారు 32 గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. **ఏలేశ్వరం** మండలంలోని 5600 ఎకరాల్లో వరి సాగు చేయగా సగం మంది రైతులు తుఫానుకు ముందే కోతలను పూర్తి చేశారు. మిగిలిన పొలాల్లో చాలా వరకు కోతలు పూర్తై పనల మీద ఉండగా, మరికొన్ని పొలాల్లో పండిపోయి ఈదురుగాలులకు నేలకొరిగి నీట మునిగాయి. రైతులు అధికారులు వర్షం తగ్గుముఖం పట్టడంతో పొలాల్లోకి వెళ్లి నష్టాన్ని పూడ్చే చర్యలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని బి.జ్యోతి మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. **రౌతులపూడి** మండల వ్యాప్తంగా 3500 ఎకరాలలో వరి నాట్లు వేయగా తుఫాను ప్రభావంతో 900 ఎకరాలలో వరి పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయ శాఖ వ్యవసాయ శాఖ అధికారి ఈశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. రహదారులు జలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని తాళ్లరేవు, పోలేకుర్రు, పటవల ప్రాంతాల్లో వందలాది ఎకరాలు నీట మునిగాయి. ఆయా గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పర్యటించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని రైతులు కోరారు. అలాగే మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మండలంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. పలువురు రైతులు వారి బాధలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ పంట పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఈ పర్యటనలో ఎంపిటిసి సభ్యులు రచ్చ ముత్యాలు, నాయకులు రాయుడు గంగాధర్, గంజా సూరిబాబు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని పలు ప్రాంతాల్లో మండల వ్యవసాయ అధికారిని జోకా అమృత నీట మునిగిన పంటలను పరిశీలించారు. నీట మునిగిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. **పెద్దాపురం** మండల పరిధిలో సుమారు 60 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం సంభవించిందని ప్రాథమిక పరిశీలనలో గుర్తించినట్లు మండల ఉద్యాన అధికారి ఎన్ సుజాత తెలిపారు. 2 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం సంభవించిందన్నారు.18 మంది రైతులకు సంబంధించిన 40 హెక్టార్లలో కర్ర పెండలం దుంప పంటకు నష్టం సంభవించగా 15 హెక్టార్లలో అరటి, 2 హెక్టార్లలో బొప్పాయి పంటలకు నష్టం సంభవించిందన్నారు. మండల పరిధిలో నేత పనులు జరగక చేనేత కుటుంబాలు పస్తులతో అవస్థలు పడుతున్నాయని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక భాస్కర కాలనీకి చెందిన చేనేత కార్మికులు కొమ్మన వెంకటరమణ, బత్తుల నాగరాజు,బాసిన శ్రీనివాసరావు, గొర్లి నూకరాజు, శ్రీశైలం, పిచ్చిక సత్యనారాయణలు మాట్లాడుతూ మగ్గం పై చేనేత పనులన్నీ తిరిగి పున ప్రారంభించాలంటే తుపాను ఆగిపోయిన తర్వాత వారం రోజులు పడుతుందని, అంతవరకు చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడతారన్నారు. **గండేపల్లి** గత మూడు రోజులుగా కురిసిన వర్షంతో వందలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, ఎంపిడిఒ వెంకట రామన్ మండలంలోని యర్రంపాలెం, సూరంపాలెం, నాయకంపల్లి, యల్లమిల్లి, సింగరం పాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 421 ఎకరాల్లో పంట నీటిలో మునిగిపోగా, సుమారు 265 ఎకరాల్లో నేలనంటిందని, శనగ పంట సుమారు 778 ఎకరాల్లో మొలక శాతం దెబ్బతిన్నట్లు తెలిపారు. **కాజులూరు** మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇందులో కౌలు రైతులు అధికంగా పంటను నష్టపోయారు. మండలంలోని పలు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారు.మంత్రి దాడిశెట్టి రాజా తొండంగి మండలం ఎ.కొత్తపల్లి, బెండపూడి గ్రామాల్లో పర్యటించారు. రైతులకు జరిగిన నష్టానికి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని, అధైర్యపడవద్దని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మాకినేటి బాబు, పోతల లక్ష్మణ్, గంగ బాబు తదితరులు పాల్గొన్నారు. **పెదపూడి** మండలంలో నీటిలో మునిగిపోయిన ధాన్యం రాశులను, పొలంలోనే నేలనంటిని వరి పంటను ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరిశీలించారు. కరకుదురు, ఎపిత్రయం, రామేశ్వరం గ్రామాల్లో పర్యటించిన ఆయన రైతులతో మాట్లాడారు. తక్షణం మండలంలో పంట ఏ మేరకు పాడైందో అంచనాలు తయారు చేయాలన్నారు. **సామర్లకోట రూరల్** ఎడతెరపిలేని వర్షంతో మండలంలోని, పట్టణంలోని జనజీవనంకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్, జి.రాగంపేట రోడ్డులో జగనన్న కాలనీ ముంపునకు గురైయింది. పెదబ్రహ్మదేవంలో విద్యుత్ పోల్స్ పడిపోయాయి. గొంచాల గ్రామానికి వెళ్ళే తారు రోడ్డు పక్కకు ఒరిగి పోయి ధ్వంసం అయ్యింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మట్టి రోడ్డు ధ్వంసం కావడంతో తడిసిపోయిన ధాన్యాన్ని తెచ్చుకునేందుకు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారీ వర్షాలకు పాడైన వరి ధాన్యం పొలాలను గొంచాల, నవర చంద్రంపాలెం గ్రామాల్లో బుధవారం ఎంఎల్ఎ చినరాజప్ప పర్యటించారు.



కాకినాడ స్మార్ట్ సిటీలో మునిగిపోయిన గృహాలు



తాళ్లరేవులో పంట పొలంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు



సామర్లకోటలో పడిపోయిన విద్యుత్ స్తంభం



కోటనందూరులో ముంపులో ప్రయాణిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



శ్రీధర్ రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్బిరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఆంధ్రాయునివర్శిటీ నుంచి డాక్టరేట్ సాధించారని ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ వివిఎస్ కేశవరావు నేతృత్వంలో శ్రీధర్ రెడ్డి సమర్పించిన 'వర్చువల్ అగ్రికల్చర్ ఎన్విరాన్ మెంట్‌లో రెడుండెంట్ రోబోట్ యొక్క విలోమ కైనమాటిక్స్ మరియు డైనమిక్ కంట్రోల్' అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డా. శ్రీధర్ రెడ్డి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. డాక్టర్ ఎమ్.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలు రాజకీయ పార్టీలు, దళిత, ప్రజా సంఘాలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కాకినాడ** స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, ఆర్‌పిఐ రాష్ట్ర నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సిఐటియు సీనియర్ నాయకురాలు జి.బేబిరాణి, తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు కెఎస్.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియా డారు. భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తే, ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నా లు చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.వీరబాబు, టి.రాజా, కె.సత్తిరాజు, పి.వీరబాబు, పి.రామకృష్ణ, జె.శ్రీనివాస్, సిహెచ్.పద్మ, జి.సత్యానందం, దళిత సంఘాల నాయకులు బి.కామేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, నూకరాజు, ఎం.డేవిడ్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర కమిటీ సభ్యులు దడాల ఆదర్శ కార్తిక్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, హాస్టల్ వర్కర్ సుబ్బలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, కట్టా రాజబాబు, అంబేద్కర్ యూత్ సభ్యులు గుర్రాల యాకోబు, పాల్గొన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, డి.కృష్ణ, పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక అంబేద్కర్ భవన్, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాయుడు సునీత గంగాధర్ పాల్గొన్నారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పెయ్యల రమేష్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పాల్గొన్నారు. పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో క్యాండిల్ లైట్లు వెలిగించి శాంతి ర్యాలీని నిర్వహించారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, రాయుడు గంగాధర్, వళ్ల రాజబాబు, కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. **సామర్లకోట రూరల్** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో, రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ డి.రమేష్ ఆధ్వర్యంలో, స్థానిక13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో బలుసులపేటలో అంబేద్కర్ 67వ వర్ధతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కోట బజార్‌లో జనసేన జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మేనేజరు సీరెడ్డి అచ్యుతరాజు, ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.



కాకినాడ సభలో మాట్లాడుతున్న రాజశేఖర్, కెఎస్ శ్రీనివాస్

వర్తక సంఘం అధ్యక్షునిగా అనిశెట్టి

ప్రజాశక్తి - కాకినాడ

బంగారం, వెండి, డైమండ్స్ వర్తక సంఘం అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ 6వ సారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. బుధవారం కాకినాడ తిలక్ వీధిలో ఉన్న అసోసి యేషన్ సంఘం హాలులో సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా గత ఏడాది జరిగిన కార్యక్రమాలు, పద్దులపైన చర్చించారు. అనంతరం సంఘ సభ్యులు అడిగిన సందేహాలను నివత్తి చేశారు. అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నింది.గౌరవాధ్యక్షుడుగా పట్నాల రాము, అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షుడుగా ఎండి బహుదూర్, కార్యదర్శిగా మహడి శ్రీనివాస్, కోశాధికారిగా సయ్యద్ జిలాని, సహాయ కార్యదర్శిగా ఆవుపాటి సత్యనారాయణ, అసోసియేషన్ భవన అధ్యక్షుడిగా నాగులకొండ రాము, ఉపాధ్యక్షుడిగా మందారపు బ్రహ్మానందం, కార్యదర్శిగా మట్టపల్లి సురేష్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కొండయ్యపాలెపు రాంబాబు, కోశాధికారిగా బవిరిశెట్టి విశ్వనాథం ఎంపికయ్యారు. ఈ ఎన్నికకు వాకచర్ల సూర్యం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిశెట్టి రామకృష్ణ

యలమాటిని పరామర్శించిన జడ్‌పిటిసి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన టిడిపి అధ్యక్షులు యలమాటి కాశి తల్లి వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి బుధవారం ఆమె కుమారుడు కాశీ, అల్లుడు ఇప్పర్ల బాబిలను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో కంటిపూడి రామయ్య, సుంకవల్లి రమేష్ తదితరులు ఉన్నారు.



కాశీని పరామర్శిస్తున్న జడ్‌పిటిసి పరిమి

కార్టూ'నిజం'



అంబేద్కర్ విగ్రహాలకు అంగన్‌వాడీల వినతులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి సమ్మెలోకి వెళ్తున్న అంగన్‌వాడీలు బుధవారం వినూత్నంగా తమ పోరాటాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. **పెద్దాపురం** గత ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టిఎల్.పద్మావతి, కాలే దేవి, స్నేహలత, సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జగ్గంపేటలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నం, సుజాతల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. నేటి నుంచి జరగబోయే సమ్మెను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృపాభాయ్, వెంకటలక్ష్మి, చంటమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు. **కరప** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మనోజ, కల్పలత, జ్యోతి, సత్యవతి, హైమా. దుర్గ పాల్గొన్నారు.



జగ్గంపేటలో అంబేద్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

3126.2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 3126.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. గడచిన 24 గంటల్లో జిల్లాలోని 148.9 మిల్లీ మీటర్‌ల సరాసరితో 3126.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా శంఖవరం మండలంలో 265.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పెదపూడిలో 81.2 మి.మీ నమోదయింది. రౌతులపూడి 253.4, గొల్లప్రోలు 219.6, తొండంగి 189.0, కిర్లంపూడి 173.2, కోటనద్దూరు 169.8, ఏలేశ్వరం 168.4, ప్రత్తిపాడు 162, పిఠాపురం 158.4, కాకినాడ అర్బన్ 156.8, యు.కొత్తపల్లి 145.8, కాకినాడ రూరల్ 142.8, జగ్గంపేట 140.4, తుని 124.2, కరప 110.6, కాజులూరు 96.8, సామర్లకోట 95.8, పెద్దాపురం 94.4, తాళ్లరేవు 93.4, గండేపల్లి 84.6 మిల్లీ మీటర్ల నమోదయింది.

రూ.35 లక్షలతో సిసి డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని కత్తిపూడి గ్రామంలో రూ.35 లక్షలతో సిసి డ్రయిన్‌ను నిర్మించనున్నట్లు సర్పంచ్ కొల్లు సత్తిబాబు తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20 లక్షల మంజూరు అయ్యాయని, ఆ నిధులతో చేపట్టే సిసి డ్రయిన్ నిర్మాణానికి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారని వివరించారు. ఆ నిధులకు తోడుగా ఎంపి ల్యాండ్ నుంచి మరో రూ.15 లక్షలతో కలిపి 900 మీటర్లు సీసీ డ్రయిన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు.

కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని సంపద తయారీ కేంద్రాలను పంచాయతీ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని ఇవిపిఆర్‌డి కె.రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని చదలాడ సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంపద తయారీ కేంద్రం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ తయారీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి

ప్రజాశక్తి - అన్నవరం

పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ సూచించారు. గురువారం అన్నవరం, అరేంపూడి గ్రామాల్లో నీటిలో మునిగిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పొలంలో నీరు బయటకు పోయేటట్లు చూడాలని, వర్షాలు తగ్గాక బూజు తెగులు రాకుండా ప్రోపికొనజోల్ 1మి.లీ లేదా 2 గ్రా.సాఫ్ పౌడర్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు తగ్గాక పొలంలో కోసి ఉన్న పనలను గట్లపై ఉంచి 50 గ్రా.గడ్డ ఉప్పును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల గింజ మొలకెత్తకుండా నిలువరించగల్గుతామని వివరించారు. మండలంలో సుమారు 88 ఎకరాల్లో వరి పంట ఒరిగిపోయిందని, 25 ఎకరాల్లో పంట పనలపై ఉందని గుర్తించామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో మోటార్ సైకిల్‌పై వెళుతున్న తండ్రీ, కూతుర్లను బుధవారం వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన నర్సు దొమ్మేటి సత్యవతి(35) తండ్రి కళ్ళముందే దుర్మరణం చెందింది. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సత్యవతిని విధులకు హాజరయ్యేందుకు తండ్రి మోటార్ సైకిల్‌పై తీసుకు వెళుతుండగా స్థానిక స్టేషన్ సెంటర్లో వెనకనే వస్తున్న లారీ మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన సత్యవతి అపాస్మారక స్థితికి చేరుకోగా ఆమెను చికిత్స నిమిత్తం అచ్చంపేట గ్రామంలోని మెడికోవర్ ఆసుపత్రికి తరలించగా ఆమె మృతి చెందింది. ఈ ప్రమాదంపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనంచేసుకున్న బంగారం నగలతో డిఎస్‌పి తదితరులు

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-మండపేట

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లాల దొంగల ముఠాను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.8 లక్షల విలువైన 85 గ్రాముల బంగారం, 3కేజీల వెండి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇటీవల కాలంలో మండలంలోని అర్తమూరు, వేములపల్లి, ఏడిద, తాపేశ్వరం, మండల కేంద్రమైన రాయవరం, రామచంద్రాపురం మండలం లోని సత్యవాడ గ్రామాల్లో జరిగిన వరుస దొంగతనాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో రూరల్ సిఐ కె.శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ బళ్ల శివకష్ణ, క్రైం సిబ్బంది ఏసు కుమార్, నారాయణలు బందాలుగా ఏర్పడి నిందితుల కోసం కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. బుధవారం ఉదయం నెంబరు ప్లేటు లేని వాహనంపై జడ్.మేడపాడు వంతెనపై అనుమానాస్పదంగా ఉన్న పిల్లి సురేష్, ఉండి శివసుబ్రహ్మణ్యం, బొగడా శ్రీనునాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. కోనసీమ, గుంటూరు జిల్లాల్లో నేరం చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. వీరివద్ద నుంచి చోరీకి పాల్పడిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తుకు సహకరించిన సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

రత్నగిరిపై యాత్రికులకు గాయాలు

ప్రజాశక్తి - అన్నవరం

వీర వెంకట సత్యనారాయణ దేవస్థానం రత్నగిరి కొండపై షెడ్డు విరిగి పడటంతో ఇద్దరు యాత్రికులు గాయపడ్డారు. వార్షిక కళ్యాణ వేదిక ఉన్న షెడ్డు విరిగిపోయింది. దీంతో ఆ షెడ్డులో విశ్రాంతి తీసుకుంటున్న సత్తెనపల్లి, గొల్లపల్లి ప్రాంతాలకు చెందిన ఆదిలక్ష్మి, గురమ్మ గాయపడ్డారు వీరికి స్థానికంగా ప్రాథమిక వైద్యాన్ని అందించి కాకినాడ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



కలెక్టర్ కు తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న జ్యోతుల నెహ్రూ

రైతులను తక్షణమే ఆదుకోవాలి: నెహ్రూ

ప్రజాశక్తి - కాకినాడ

కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ కోరారు. తడిసిన ధాన్యాన్ని నమూనాగా తీసుకుని ఆయన బుధవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకి కలిసి రైతుల ఇబ్బందులను వివరించారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ పద్ధతిలో కాకుండా ఉన్న ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా ధాన్యంను కొనుగోలు చేయాలని సూచించారు. దీనిపై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు తగురీతిలో ఆదేశాలు జారీ చేశారు. ధాన్యంను ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేయాలని ఆదేశించడంపై జ్యోతుల నెహ్రూ ధన్యావాదాలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, జిల్లా వికలాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర తదితరులు ఉన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

క్రీడా సామగ్రి కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాట్మెంటన్ తదితర క్రీడలకు సంబంధించిన క్రీడా సామాగ్రి కిట్లను మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పట్టణ పరిధిలోని 14 సచివాలయాలకు సంబంధించి ఈ కిట్లును ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా రాజబాబు, కొట్టి కిషోర్ పవన్, ఆరేళ్ల వీర రాఘవ, విడదాసరి నాగేంద్ర, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడంతోపాటు రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకు అనుగుణంగానే ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం జరుగుతుందని జిల్లా ఓటర్ల జాబితా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన సంక్షిప్త సవరణ జాబితా-2024పై ఇఆర్ఒలతో ప్రత్యేక సమావేశం జరిగంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల సవరణకు సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పక్క రికార్డులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు సచివాలయల్లో నోటీసులను ఉంచాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో బిఎల్ఒలు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపకల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా జిల్లాలో ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1,637 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 15,82,112 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 7,80,027 మంది పురుషులు 8,01,898 మంది స్త్రీలు, 187 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ఫాం 6, 7, 8 లకు సంంధించిన క్లైములు 3,30,383 వచ్చాయని, అందులో 2,99,958 పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 30425 దరఖాస్తులను గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఈనెల 26 నాటికి పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిష్కరించి, 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, ఇఆర్ఒలు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ఎన్.యువరాజ్ నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో ఉన్న 55వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి యువరాజ్, చిత్రంలో కలెక్టర్, జెసి

రైతులపై టిడిపి మొసలి కన్నీరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

లేని పోని విమర్శలు చేస్తూ బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న టిడిపి నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని, రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకొంటుందని పెదబ్రహ్మదేవం గ్రామ ఎంపిటిసీ మలకల సూర్యారావు (సూరిబాబు), గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ తదిత రులు విమర్శించారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామం అన్నపూర్ణ ఎత్తిపోతల పథకం వద్ద రైతులతో సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఎప్పటికప్పుడు తుపాన్‌పై సమీక్షలు చేస్తూ, జిల్లా కలెక్టర్లకు అధికారులకు ఆదేశాలు మిచౌంగ్ తుఫాన్ వర్షాలపై అప్రమత్తం చేస్తున్నారని, ప్రతీ ధాన్యం గింజా ప్రభుత్వం కొంటుందని రైతులు అధైర్య పడవద్దన్నారు. ఇది జగన్ ప్రభుత్వం రైతులు అధైర్య పడవద్దన్నారు. టి డి పి నాయకులు మొసలి కన్నీరు ఒలకపోస్తూ హడావిడి చేస్తూ తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, రైతుల మనోధైర్యాన్ని కుంగదేస్తున్నారని మలకల సూరిబాబు అన్నారు. ఈ ప్రభుత్వం రైతు పక్ష పాత ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏమి చేయాలో అన్నీ చర్యలు చేస్తుంది అని సూరి బాబు చెప్పారు. గ్రామం లో పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటి అధ్యక్షులు మలకల పేపకాయల సత్తిబాబు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక భానుగుడి పోలీస్ కన్వెన్షన్‌లో హోంగార్డు 61వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ పాల్గొని హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1963 డిసెంబరు 6న రాష్ట్రంలో హోంగార్డ్ ఆర్గనైజేషన్ ప్రారంభం అయ్యిందని, పోలీసు శాఖకు అనుబంధంగా ప్రజలకు విశేష సేవలు అందిస్తోందని తెలిపారు. జిల్లాలో హోంగార్డ్స్‌లు పోలీసు స్టేషన్లు, సర్కిల్స్, ట్రాఫిక్ రెగ్యులేషన్, డ్రైవర్స్, కంప్యూటర్ ఆపరేటర్, శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను ఆరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా నిలవడం ప్రశంసనీయమని అన్నారు. సమాజ సేవలో తమ సేవలను ఉచితంగా అందిస్తూ కాలక్రమేణా వారికి గౌరవవేతనం ఇవ్వటం జరిగిందని, ప్రస్తుతం హోంగార్డ్స్ గౌరవ వేతనం రోజుకు రూ. 710లుగా ఉందన్నారు. విజిలెన్స్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ట్రాన్స్‌పోర్ట్, ఫైర్ సర్వీసెస్, ఒఎన్‌జిసి, పవర్ ప్లాంట్, సబ్ జైల్, దేవస్థానాలు, మొదలగు శాఖలకు డిప్యుటేషన్‌పై హోంగార్డ్స్ సేవలు అందిస్తూ పోలీస్ డిపార్టుమెంటు గౌరవాన్ని, ప్రతిష్టను అన్నివర్గాల ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. హోంగార్డ్స్ ఎవరైనా మృతి చెందినా, పదవి విరమణ చేసినా వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ ఒక రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పిలు పి.శీనివాస్, బి.సత్యనారాయణ, డిఎస్‌పిలు వెంకట అప్పారావు, పి మురళీ కృష్ణారెడ్డి, జయరాం ప్రసాద్, ఎస్ రాంబాబు, బోను అప్పారావు, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి శివరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముంపులో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మిచౌంగ్ తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సామర్లకోట జగనన్న కాలనీ పూర్తిగా మునిగి పోయింది. ఇ క్కడ నివసిస్తున్న ప్రజలు ఇంటినుంచి కనీసం కాలు భయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం కాలనీలో డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించక పోవడమే నని ప్రజలు ఆరోపిస్తున్నారు. జగనన్న కాలనీలో సుమారు 1000 గహాల్లో ప్రజలు నివసిస్తున్నారు. సిఎం జగన్ చేతులమీదుగా ఆర్భాటంగా ప్రారంభోత్సవాన్ని పూర్తి చేశారు. తాగునీరు, విద్యుత్, గ్రావెల్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాలున్నా డ్రెయిన్లు ఏర్పాటు లేకపోవడంతో ఈ వర్షాలకు కాలనీలో చేరిన నీరు బయటకు పోయే అవకాశం లేక కాలనీ అంతా జల దిగ్బంధంలో చిక్కుకుని ఉండిపోయింది. దానితో జన జీవన స్తంభించింది. వంట సరుకులు సైతం బయటకు వెళ్లి తెచ్చుకునే అవకాశం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో నిత్యావసర సరుకులు లభించే విధంగా ఇంకా సరైన దుకాణాలు లేకపోవడంతో గత మూడు రోజులుగా వర్షానికి బయటకు వెళ్లలేని పరిస్థితులు ఎదురయ్యాయి.

మత్స్యకారులకు నిత్యావసరాలను అందించాలి



మత్స్యకారులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

తూఫాన్ వల్ల వారం రోజులుగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు నిత్యావసర సరుకులను సరఫరా చేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ కోరారు. గురువారం స్థానిక దుమ్ములపేటను ఆనుకుని ఉన్న కాలువలో నిలిపివేసిన బోట్ల యజమానులు, కార్మికులను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో సుమారు 1500 బోట్లపై 10 వేల మంది మత్స్యకారులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. గత వారం రోజులుగా వీరంతా ఉపాధి లేక కుటుంబ పోషణ గడవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేవలం వేట నిషేధం సమయంలో మాత్రమే మత్స్యకారులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటుందని, మిగిలిన సమయాల్లో వారిని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తూఫాన్ ప్రభావంతో మరో రెండు రోజుల వరకూ వేటకు వెళ్ళడానికి అవకాశం లేదని, ఈలోపు తాము ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మత్స్య కార్మిక సంఘం నాయకులు తెలిపారు. వేటకు వెళ్లే బోట్, రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి బియ్యం, నూనె, పప్పు అందించాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మిక సంఘం నాయకులు యు.సత్యనారాయణ, సిహెచ్.రమణి, రాజు, శ్రీను, తాతారావు డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణపై సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ తదితర అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు బుధవారం సమావేశం నిర్వ హించారు. గత వారంలో చేపట్టిన ఓటర్ జాబితా సవరణ సంబంధించిన ప్రక్రియను ప్రతినిధులకు విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి ఓటరు జాబితా పరిశీలకులు (పరిశ్రమల శాఖ కమిషనర్) యువరాజు జిల్లాకు రానున్నారని అన్నారు. ఈ నెల ఏడో తేదీ గురువారం సాయంత్రం ఓటర్ జాబితా పరిశీలకులు జిల్లాకు రానున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. ఈ నెల రెండు మూడు తేదీలలో పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో ఓటరు నమోదు, సవరణల కొరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 1644 పోలింగ్ కేంద్రాల్లో ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులు 12,221 వచ్చా యని తెలిపారు. డిసెంబర్ 9 వరకు మూడు రకాల దరఖాస్తులను స్వీక రించడం జరుగుతుందని తదుపరి ఈ యొక్క దరఖాస్తులను డిసెంబర్ 24 లోపల పరిష్కరించ డం జరుగుతుందన్నారు. ఈనెల ఏడో తేదీ నుంచి ఇవిఎంలపై గ్రామ గ్రామాన ఓటర్లకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి శిక్షణ కొరకు 12 చొప్పున ఇవిఎంలు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయ పార్టీ ప్రతినిధుల సందేహాలను నివత్తి చేశారు ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వడ్డీ నాగేశ్వరరావు బిజెపి తరపున డి.రాజేష్, వైసిపి తరఫున సంసాని వెంకట భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఒ సత్తిబాబు

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుల మాత అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం దాత విరాళం అందజేశారు. విజయవాడ పట్టణం రాజంపేటకు చెందిన దొడ్డపనేని రాజనాయుడు రూ.50 వేల విరాళాన్ని అన్నదాన భవన నిర్మాణం నిమిత్తం ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ సత్య నారాయణ రాజులకు అంద జేశారు. ఈ సంద ర్భంగా దాతకు స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి కృత జ్ఞతలు తెలియ జేశారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆలమూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా విఒఎలకు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ కె.జాన్ లింకన్, ఉపాధి ఎపిడి సత్యనారాయణ, ఎంఇఒ సాలెం రాజు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, కోకో, బ్యాట్మెంటన్ వంటి క్రీడలపై ఆసక్తి గల వారిని యువతను ఎంపిక చేసి టీములుగా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు స్థానిక గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు. ఆసక్తి కలవారు తప్పక వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సుబ్బరాజు, ఏపీవో ప్రసాద్, ఏపిఎం ధనరాజు, మండల పరిషత్ ఏవో రామ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎంపీ

ప్రజాశక్తి-అమలాపురం

విజయవాడలోని బుధవారం ఎంఎల్‌సి, సిఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం కుమార్తె వివాహ వేడుకల్లో సిఎం జగన దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమలాపురం ఎంపీ చింతా అనురాధ సిఎం జగన్ దంపతులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనురాధ తో పాటు వైసిపికి చెందిన మహిళ ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

యానాం వార్తలు

పల్లపు ప్రాంతాలను పరిశీలించిన ఎంఎల్ఎ



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

భారీ వర్షాల నేపథ్యంలో పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామితో కలిసి బుధవారం పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. కురసాంపేట గ్రామంలో ఇండ్లలోకి నీరు చేరడంతో వాటిని పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కల్వర్టులు పూర్తిగా వ్యర్థాలతో నిండిపోవడంతో వర్షపు నీరు చేరి కల్వర్టులు పైనుంచి నీరు పోటెత్తుతుందని గ్రామస్తులు ఎంఎల్ఎకు తెలిపారు. కల్వర్టులను ఆధునీకరణ చేయాలని పిడబ్ల్యుడి అధికారులను ఆదేశించారు. 1996లో రూ.35 వేల రుణంతో నిర్మించుకున్న ఇల్లులు ప్రస్తుతం శిథిలాస్థితికి చేరుకున్నాయని, తక్షణమే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా పనుల శాఖ అధికారులు జ్యోతి రాజు, భాస్కర్, సిఐ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లకు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ఈనెల 14, 15 తేదీల్లో వికలాంగులకు ధృవీకరణ పత్రాలు అందించేందుకు పుదుచ్చేరి నుంచి (ఎముకలు, మానసిక, నరాలు, కళ్ళు, చెవి, ముక్కు,గొంతు) వైద్యులు యానాం విచ్చేయుచున్నారని వైద్య శాఖ అధికారి టి రవిశంకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దానికి సంబంధించి పేర్లు నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 8, 9, 11 (శుక్ర, శని, సోమవారం) తేదీల్లో ఆయా గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు కొరకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాత ధృవీకరణ పత్రాలు, రెండు ఫోటోలు తీసుకురావాలన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద, గోపాల్ నగర్ విజ్ఞాన్ భవన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి నివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివాళులర్పించారు. అదేవిధంగా దరియాలతిప్ప, ఫరంపేట, కనకాల పేట, బీమ్ నగర్, వికాస్ కాలనీ, అంబేద్కర్ నగర్, రమాబాయి నగర్, ఆదిఆంధ్ర పేట తదితర గ్రామాల్లో ఉన్న ఆయన విగ్రహానికి ఆయా గ్రామాల ప్రజలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పండు సిద్ధార్థ కుమార్, బలరాం, నక్కల సుబ్బన్న, కనకాల రాజు, కాకి నాగేశ్వరరావు దుగ్గుదుర్తి అనిత, కొమ్ము కుమారి తదితరులు పాల్గొన్నారు.